పత్రికాప్రకటన కాకినాడ, 2.2.2019

నిత్య జీవితంలో ప్రతి అంశంలోను, వస్తువులోను మిళితమై ఉన్న గణితం, సైన్స్ పట్ల భయం విడనాడాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా విద్యార్థులకు సూచించారు.

శనివారం ఉదయం కాకినాడ రూరల్, వలసపాకలులోని కాకినాడ పబ్లిక్ స్కూల్‌లో క్రియేటీవ్ మైండ్స్ - షో ఆఫ్ డైనమిక్ స్కాలర్స్ పేరిట ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా ముఖ్య అతిధిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు గణితం, సైన్స్ సబ్జెక్‌లంటే కష్టమని భావిస్తుంటారని, దైనందిన జీవితంలో చుట్టుప్రక్కల మనం వాడే ప్రతి వస్తువు స్వరూపం, స్వభావం, కదలికలోను గణితం, సైన్స్‌ల ఉనికి ఇమిడి ఉందనే అంశాన్ని గమనిస్తే ఈ సబ్జెక్ట్‌లే చదవడానికి ఎంతో ఆశక్తికరంగా మారతాయన్నారు. పాఠాలను బట్టీపట్టి వల్లెవేయడం వల్ల ఉపయోగం లేదని, వాటిలోని విషయ జ్ఞానాన్ని అర్థం చేసుకుని చదివితే జీవితంలో ఎప్పటికీ మరిచిపోవడం జరగదని తెలిపారు. తెలుసుకున్న వైజ్ఞానిక అంశాల ప్రాక్టికల్ అప్లికేషన్ ద్వారా వాటి ప్రయోజనాలను మరింత ఎక్కవగా ఆస్వాదించవచ్చుని, ప్రతి అంశాన్ని కార్య, కారణ విశ్లేషణతో తరచి చూచే శాస్త్రీయ దృక్పధాన్ని విద్యార్థులు అలవరుచుకోవాలని కోరారు. సైన్స్ ఫెయిర్‌లో ఉత్సాహంగా పాల్గొని ఎగ్జిబిట్‌లు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించి, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రదర్శనలలో కూడా పాల్గొని ప్రతిభాపాటవాలను చాటాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సర్వోదయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఉపాధ్యక్షులు డా.ఐ.వి.రావు, సెక్రటరీ కె.విశ్వనాధరావు, ఎగ్జిక్యూటీవ్ మెంబరు ఎల్.శేషుకుమారి, కాకినాడ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ లో కాకినాడ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో పాటు, మోహన్ హైస్కూల్, విద్యాంజలి సిబిఎస్ఈ స్కూల్, పిఎస్ఎల్‌వి, బాస్కర, శ్రీచైతన్య, న్యూ మదర్ థెరీసా తదితర పాఠశాలల విద్యార్థులు కూడా ఆశక్తిదాయకమైన, ఆలోచింపచేసే మోడళ్లను ప్రదర్శించారు.

(సమాచార శాఖచే జారీ)